క్లుప్తంగా

చెస్ పోటీల్లో అమలోద్భవి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అమలోద్భవి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం యూత్ కల్చరల్ క్లబ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ అంతర్జాతీయ చెస్ పోటీల్లో నగరంలోని అమలోద్భవి పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రోజ్‌మీ తెలిపారు. ఈ పోటీల అండర్–10 విభాగంలో అభిషేక్ అబ్రహమ్ 4వ స్థానం సాధించాడన్నారు. గతంలో కూడా తమ పాఠశాల విద్యార్థి జి.అనురూప్ మోషే అంతర్జాతీయ స్థాయిలో అండర్–7 విభాగంలో రెండో స్థానంలో నిలిచాడని గుర్తుచేశారు. వీరిని పాఠశాలలో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు కె.రెడ్డి, ఐ.శ్రీనివాస్, జి.యోహానన్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



శిబిరంలో పాల్గొన్న సీఆర్ఆర్ కళాశాల, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రక్తదానం చేయడానికి విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకురావాలని సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ఇటీవల రక్తం లభించక అనేక మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రాణాపాయ పరిస్థితులను తొలగించడానికి రక్తదాతలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైద్యాధికారి వరప్రసాదరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వల్ల అనారోగ్యాలూ రావని, ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు, కేబీ రావు, డి.రమాదేవి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలోనూ సంక్షేమం

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : పేద కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసేలా సంక్షేమ పథకాలు అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 119వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, పార్టీ నాయకులు కోయ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే నాని పాదయాత్రగా డివిజన్‌లో ప్రతి ఇంటికి వెళ్లి పథకాల అమలుపై ఆరా తీశారు. అవ్వా, తాతలకు పింఛన్ అందుతుందా ? అని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే సమస్యను పరిష్కరించి, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులను నాని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి పాటుపడుతూ అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. పేదవానికి గూడు కల్పించేందుకు ఏలూరు నియోజకవర్గంలో 30 వేల ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామని, తొలిదశలో 16 వేల ఇళ్ల నిర్మాణాలు వేగంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. టీడీపీ హయాంలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వని దుస్థితిని వివరించారు. నేడు పేదలకు ఇళ్లు కట్టిస్తూంటే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆశీస్సులతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ బి.సోమశేఖర్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

ఏలూరు (టూటౌన్): రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతాంగాన్ని మోసగించిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని కార్మిక, కర్షక ఐక్యతతో గద్దె దించుతామని ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ నెల 27, 28 తేదీల్లో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు నిర్వహించే మహాధర్నాను విజయవంతం కోరుతూ ఏపీ రైతు సంఘాల కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య హాజరై మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. దొడ్డిదారిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేస్తూ రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసే చర్యలు చేపడుతోందని వివరించారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపు ఆపాలని, ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మహాధర్నా బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వివిధ సంఘాల నాయకులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, బండి వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఎస్‌కే బాషా, తలారి ప్రకాష్, రాయంకుల లక్ష్మణరావు, కె.అప్పారావు, కుంజం రామారావు, కె.పోసమ్మ, సముద్రాల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేశవరావు

అవినీతి రహిత సమాజ స్థాపనే లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు కంకణబద్ధులై ఉండాలని ఏలూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో సే నో టు కరప్షన్ – కమిట్ టు ది నేషన్ అనే నినాదంతో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉందని, ఈ తరుణంలో అవినీతిలేని సమాజంగా రూపొందించుకునేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సదస్సులో విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ పి.శ్రీనివాస్, ఏఈ టి.శ్రీనివాసరావు, ఏఈఈలు ఎం రూపేష్ వర్మ, ఎం అనిల్ బాబు, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థల వివాదంలో 10 మందిపై కేసు నమోదు

చింతలపూడి: యర్రంపల్లి గ్రామంలో ఇంటి స్థలం వివాదంలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం గ్రామంలో తగరం దేవసహాయం, తగరం వెంకటేశ్వరరావుల మధ్య ఇంటి స్థలం విషయంలో వివాదం చోటుచేసుకుంది. దీనిపై ఇరువురూ కోర్టులో కేసులు వేసుకున్నారు. ఇటీవల దేవ సహాయం ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా తగరం వెంకటేశ్వరరావు, తగరం రవికుమార్, పంతం రవి హైదరాబాద్ నుంచి రెండు కారుల్లో కొందరు వ్యక్తులను తీసుకువచ్చి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో దేవసహాయం భార్య తగరం మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రెండు వాహనాలతో సహా పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాణిక్యం ఫిర్యాదు మేరకు సుమారు 10 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు సీతంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: సీతంపేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేప పిల్లలను విడిచిపెట్టిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలంలో పుట్లగట్లగూడెం, చక్రదేవరపల్లి, ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, కేతవరం, అమ్మపాలెం గ్రామాల్లో ఉన్న చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడిచి పెట్టారు. 17 యూనిట్లకుగాను 6 లక్షల 80 వేల చేప పిల్లను విడిచి పెట్టారు. ఎ.పోలవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని చిన్న పెద్దా చెరువులో చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ మత్స్యకారుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మత్సకారుల సొసైటీ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, మత్సశాఖ సహాయ సంచాలకులు బి.నర్సయ్య, జంగారెడ్డిగూడెం మత్సశాఖ అభివృద్ధి అధికారి కె.మంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఎ.పోలవరంలో చెరువులో చేప పిల్లలను విడిచి పెడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

ఆధ్యాత్మిక చింతనతో మేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆధ్యాత్మిక చింతన, భక్తి భావన మనిషిలోని సద్గుణాలను మేల్కొలపడంతో పాటు సేవాతత్పరత కలుగచేస్తుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం ఏలూరు రూరల్ దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వాములకు ద్వాదశి 12వ వార్షిక భిక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. అయ్యప్ప మాలలో ఉన్న ఆయన అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కె.అనంతాచార్యులు కలెక్టర్‌కు వేద ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అయ్యప్ప మండల దీక్ష స్వాములకు భిక్షను వడ్డించి, స్వాములతో కలిసి భిక్ష స్వీకరించారు. తొలుత కలెక్టర్‌కు దేవస్థానం పాలకమండలి సభ్యులు, పురోహితులు, అయ్యప్ప దీక్షాధారులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. తొలుత బాల అయ్యప్పస్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప తారక మంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎర్రం శెట్టి సుమన్, ఆలయ వ్యవస్థాపకులు గుమ్మడిదల సీతారామయ్య గురుస్వామి, కార్యదర్శి బొల్లా వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గుమ్మడిదల కోటేశ్వరరావు, భిక్ష ప్రదాత పుప్పాల శ్రీనివాసు, కంది రంగబాబు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



దొండపాడులో బాలఅయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రయోజనాత్మకంగా పీఎంశ్రీ వర్క్‌షాప్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపు తదితర అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంశ్రీ పథకానికి సంబంధిచి అవగాహన కలిగించడానికి ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన పీఎంశ్రీ వర్క్‌షాప్ ప్రయోజనాత్మకంగా ఉందని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఏలూరు జిల్లా నుంచి ఏకైక ప్రధానోపాధ్యాయునిగా ఎంపికై పాల్గొన్న వెంకటేశ్వరరావు గురువారం డీఈఓ పి.శ్యామ్ సుందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్క్‌షాప్‌లో చర్చించిన అంశాలను డీఈఓకు వివరించారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాలను, వ్యక్తిత్వ వికాసాన్ని, జీవన నైపుణ్యాలను మెరుగుపరచాలని, అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే లక్ష్యంతోనే పీఎంశ్రీ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారని చెప్పారు. ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా పీఎంశ్రీ అమలు చేసి అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆశమన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును శ్యామ్ సుందర్ దుశ్శాలువాతో సత్కరించారు.



వెంకటేశ్వరరావును అభినందిస్తున్న డీఈఓ

6 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జమ్మూలో జాతీయ దివ్యాంగుల క్రికెట్ ట్రైయాంగిల్ సీరిస్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు అంతర్జాతీయ దివ్యాంగుల అంపైర్ నాగేంద్రసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ్ క్రికెట్ కంట్రోల్‌బోర్డు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు దేశంలో అనేక రాష్ట్ర జట్లు తరలిరానున్నాయని వివరించారు. ఈ పోటీలకు తనను అంపైర్‌గా వ్యవహరించాలని కోరుతూ బోర్డు అధికారి హరోన్‌రషీద్ ఆదేశాలు జారీ చేశారని నాగేంద్రసింగ్ పేర్కొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ కె.శివాజీ సూచించారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలు, ర్యాగింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీనియర్స్‌కు జూనియర్స్‌కు సత్సంబంధాలు ఉండాలని అన్నారు. వివిధ నేరాలకు సంబంధించి ఐపీసీ సెక్షన్ల ద్వారా తీసుకునే చర్యలను వివరించారు. ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీని విద్యార్థుల సిలబస్‌లో చేర్చడం ద్వారా వారికి ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తించాలో తెలుస్తుందన్నారు. ప్రతి కళాశాలలోనూ ప్రిన్సిపాల్ చైర్మన్‌గా ఒక కమిటీని నియమించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, యాంటీ ర్యాగింగ్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ఆశ్రం కాలేజ్ డే

ఏలూరు రూరల్: ఈ నెల 4న అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సస్ (ఆశ్రం) కళాశాల డే నిర్వహించనున్నామని ఆశ్రం యాజమాన్యం తెలిపింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఫిజీషియన్ డాక్టర్ ఐవీ రావు హాజరుకానున్నట్టు పేర్కొంది. జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైశ్వల్ మరో అతిథిగా పాల్గొనున్నారని, ఆశ్రం చైర్మన్ డాక్టర్ గోకరాజు గంగరాజు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో విద్య, క్రీడ, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభ చాటిన కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నామని వివరించింది.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యసేవలు

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. పెదకడిమిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు మాధవి, కులకర్ణి, భాగ్యశ్రీ, ప్రత్యూష, గౌతమ్ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, ఎంపీటీసీ సీహెచ్.గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో వి.అరుణ్‌కుమార్, ఆర్ఎ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక పోరాటానికి సిద్ధం కావాలి

ఏలూరు రూరల్: నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని న్యూడెమోక్రసీ ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు మార్కెట్‌యార్డ్ వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విప్లవ ఉద్యమం అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వెంకటరావు మాట్లాడుతూ దేశంలో పీడిత ప్రజల హక్కుల కోసం ఎందరో విప్లవ వీరులు అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. మరో నాయకుడు వెంకట్రావ్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా పోరాటం చేయనిదే సమస్యలు పరిష్కారం కావని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేఖంగా ప్రజాస్వామ్యవాదులు కలిసి కట్టుగా పోరాడాలని కోరారు. తొలుత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అమరులైన ధర్మన్న, పాదం రామకృష్ణ, నంద్యాల సుబ్బారావు, శీలబోయిన రాఘవులు, రవన్న, అరుణోదయ రామారావులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగరాజు రాము, జి.రమణ, పల్లి గంగరాజు, విజయ్, అప్పారావు, రమణ, బండి నాగేశ్వరరావు, కోరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న హమాలీలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

భీమడోలు: భీమడోలులో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయం, నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సహస్ర కలశాభిషేకం ఆకట్టుకుంది. కలశాల బిందెలతో గ్రామ పుర వీధుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం శ్రీరామ జపం చేశారు. గ్రామంలోని వందలాది మంది భక్తులు పాల్గొని హోమ ఘట్ట పూజలను తిలకరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	98512	--
ఏలూరు బీహెచ్‌ఈఎల్	22.30	98506	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	10-12
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	40
కాకర కాయలు	24 - 28	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	130
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	18	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	62	తోటకూర	12
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	15- 20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--